# మరో ఆరు రోజులు వానలు!

## బలపడిన అల్పపీడనం


జెమిని సర్కిల్

చెన్నై, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తీవ్రరూపం దాల్చింది. ఇది రానున్న 24 గంటల్లో వాయువ్య దిశగా పయనించి దక్షిణ తమిళనాడు-దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతాల మీదుగా పయనించనుంది. రానున్న 24 గంటల్లో ఆంధ్రా తీరం వెంబడి ఉత్తర దిశగా పయనించే అవకాశముంది. దీని ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 24వ తేది వరకు వర్షాలు కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం ఉత్తర కోస్తా తమిళనాడులోని అనేక ప్రాంతాలు, మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ నెల 20 నుంచి 24వ తేది వరకు కూడా తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.


కోడంబాక్కం బ్రిడ్జి వద్ద వర్షానికి చేరిన నీరు

### చెన్నైలో ఉదయం నుంచే...

రాజధాని నగరం చెన్నైలో బుధవారం ఉదయం నుంచే తేలిక పాటి జల్లులు కురిసాయి. ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. చిన్న వర్షం కావడంతో విద్యా సంస్థలు యధావిధిగా పనిచేశాయి.

### జాలర్లకు హెచ్చరిక..

రాష్ట్రంలోని తీర ప్రాంతాలు, గల్ఫ్ ఆఫ్ మన్నార్, దానిని అనుకొని ఉన్న కన్నియాకుమారి సముద్రంలో గురువారం గాలుల వేగం 35 నుంచి 45 కి.మీ ఉంటుంది. కొన్ని సమయాల్లో 55 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముంది. అందువల్ల ఆయా ప్రాంతాలకు జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# తమిళ ప్రొఫెసర్‌కు సాహిత్య అకాడమీ పురస్కారం


ఏఆర్ వెంకటాచలపతి




చెన్నై, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'తిరునల్వేలి ఎళుచ్చియుం వావూసీ యుం' అనే పరిశోధన గ్రంథాన్ని రచించిన తమిళ ప్రొఫెసర్ ఏఆర్ వెంకటాచలపతిని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. దేశవ్యాప్తంగా 24 భాషల్లో ప్రచురితమైన ఉత్తమ రచనలకు కేంద్రప్రభుత్వం సాహిత్య అకాడమి పురస్కారాలందజేస్తోంది. ఆ ప్రకారం 2024వ సంవత్సరానికి అవార్డు గ్రహీతల జాబితా బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'తిరునల్వేలి ఎళుచ్చియుం వావూసీ యుం-1908' అనే పరిశోధన గ్రంథాన్ని రచించిన తమిళ ప్రొఫెసర్ ఏఆర్ వెంకటాచలపతికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించారు.

### గ్రంథం వివరాలు...

1908 మార్చి 13న వావూసీ అరెస్ట్ తర్వాత, తిరునల్వేలి, తూత్తుకుడి నగరాల్లో ప్రజలు నిరసనలు జరిపారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం నిరసనకారులపై కాల్పులు జరపగా నలుగురు మృతిచెందారు. ఈ సందర్భంగా బ్రిటీష్ పాలకులు వందమందిని అరెస్ట్ చేయడంతో పాటు ప్రజలపై పన్నులు విధించారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక ఘట్టంగా మారిన ఈ తిరుగుబాటు గమనాన్ని సమగ్రమైన ఆధారాలతో ఈ పుస్తకంలో వివరించారు. వావూసీ తీసుకున్న వైఖరి, తిరుగుబాటుకు దోహదపడిన సాధారణ వ్యక్తుల కథలు కూడా ఈ గ్రంథంలో ఉన్నాయి.

### సీఎం అభినందన...

సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన ప్రొఫెసర్ ఏఆర్ వెంకటాచలపతికి ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... వెంకటాచలపతి నాలుగు దశాబ్దాలుగా నౌకాయానం చేసిన తమిళియన్ వీఓ చిదంబరనార్ జీవితాన్ని అధ్యయనం చేశారన్నారు. ఆయన రాసిన 'తిరునల్వేలి తిరుగుబాటు మరియు వావూసీ'ని నాటి బ్రిటీష్ పాలకులు తిరుగుబాటుగా పేర్కొనగా, దానిని సరిదిద్దిన చరిత్రకారుడు ఏఆర్ వెంకటాచలపతి అని, అది మన తిరుగుబాటుగా నమోదుచేశారని కొనియాడారు.



# 2 నుంచి నాగై-లంక మధ్య మళ్లీ నౌకాయానం

● ఛార్జీలు తగ్గింపు, ప్రత్యేక ప్యాకేజీలు

చెన్నై, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం-శ్రీలంక మధ్య జనవరి 2వ తేది నుంచి ప్యాసింజర్ నౌక రవాణా సేవలు పునఃప్రారంభం కానున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా కొద్దిరోజుల క్రితం నాగై-లంక మధ్య నౌకయాన సేవలు తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం నాగపట్టణం హార్బర్ ఉన్నతాధికారులు సమావేశమై నౌకాయానంపై చర్చించారు. అనంతరం శుభం నౌకాయాన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుందరరాజన్ మీడియాతో మాట్లాడుతూ.. నాగపట్టణం నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు ఈ నెల 19 నుంచి నౌక సేవలు ప్రారంభించాలని ముందుగా నిర్ణయించామని అయితే వాతావరణ మార్పులు, అల్పపీడనం ప్రభావం తదితరాల కారణంగా జనవరి 2 నుంచి ప్రారంభించనున్నామని తెలిపారు. గతంలో నాగపట్టణం-శ్రీలంక మధ్య వసూలు చేస్తున్న రూ.9,200 చార్జీని రూ.8,500కు తగ్గించామన్నారు. అలాగే, ఇప్పటివరకు ఒక వ్యక్తి 50 కిలోల వరకు లగేజీ తీసుకెళ్లే వసతి కల్పించగా, 2వ తేది నుంచి అదనంగా మరో 10 కిలోలు కూడా ఎలాంటి రుసుము లేకుండా తీసుకెళ్లేందుకు అనుమతించనున్నామని తెలిపారు. దానికి ఆన్‌లైన్‌లో ముందుగా నమోదుచేసుకోవాల్సి ఉందన్నారు. పర్యాటకులు రూ.15,000 చెల్లించి మూడు రోజులు విహార యాత్ర చేసేలా కొత్త ప్యాకేజీ అందిస్తున్నామన్నారు. అంతేగాక 5 రాత్రులు, 6 పగళ్లు చొప్పున ఆధ్యాత్మిక యాత్రకు రూ.30,000 ప్యాకేజీ అందిస్తున్నామన్నారు. ఈ ప్యాకేజీలకు సంబంధించి sailsubham.com అనే వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.


ఓటరు దినం సందర్భంగా జీసీసీ ఆధ్వర్యంలో 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని బుధవారం నుంగంబాక్కంలోని క్రిస్టియన్ ఉమెన్స్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారి



అతిథులతో విద్యార్థినులు, నిర్వాహకులు - సినీ నటి కుట్టి పద్మినిని సత్కరిస్తున్న ఊటుకూరు శరత్‌కుమార్, అజంతా శంకరరావు, అనంత పద్మనాభమూర్తి తదితరులు

# సూర్యకాంతం నటన అనితర సాధ్యం

● వర్ధంతి సభలో కొనియాడిన వక్తలు

ప్యారీస్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వెనుకటి తరం మహానటి సూర్యకాంతం నటన అనితరసాధ్యమని ఆమె 28వ వర్ధంతి సభలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. స్థానిక జార్జి టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ) ఐక్యూఏసీ, సృజన తెలుగు భాషా మండలి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి 'యువ' విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎస్కేపీసీ ఆడిటోరియంలో మహానటి సూర్యకాంతం వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటి కుట్టి పద్మిని, తెలుగు సినీ చిత్రకారుడు ఎస్వీ రామారావు, ఆత్మీయ అతిథులుగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, సూర్యకాంతం కుమారుడు, కోడలు, డాక్టర్ అనంత పద్మనాభమూర్తి, ఈశ్వరీ రాణీ, హాస్య రచయిత్రి జోస్యుల ఉమా, ఎస్కేపీసీ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహనశ్రీ, తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ మైథిలి తదితరులు పాల్గొని వివిధ పాత్రల్లో జీవించిన సూర్యకాంతం నటనను కొనియాడారు. ముందుగా నటి కుట్టి పద్మిని మాట్లాడుతూ.. తాను బాల నటిగా ఉన్నప్పుడు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్వీ రంగారావు, సావిత్రి, సూర్యకాంతం, దేవిక, రేలంగి తదితర మహానటులతో ఉన్న పరిచయాలను వేదికపై గుర్తు చేసుకున్నారు ఎక్కువ సినిమాల్లో గయ్యాళి అత్తగారిగా సూర్యకాంతం నటన అనితరసాధ్యమని, ఆమె చరిత్రలో నిలిచిపోతారన్నారు. అనంతరం ఎస్వీ రామారావు మాట్లాడుతూ.. సూర్యకాంతం వంటి లెజెండ్రీ నటులు పనిచేసిన కాలంలో తాను చిత్రకారుడిగా వ్యవహరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అజంతా శంకరరావు మాట్లాడుతూ.. సూర్యకాంతం భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆమె నటనా వెలుగులు అస్తమించలేదని, ఆమె వర్ధంతిని ఎస్కేపీసీ విద్యార్థినులతో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎస్కేపీడీ యాజమాన్యం విద్యతో పాటు, ఆధ్యాత్మికం, సాంఘిక సేవల్లో రాణిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అతిథులను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సభలో గుడిమెళ్ల మాధురి, కల్పన గుప్తా, గుర్రం బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎస్కేపీసీ సృజన తెలుగు భాషా మండలి విద్యార్థినులు సూర్యకాంతం గురించి రూపొందించిన 'నవరస నట శిఖామణి' అనే దృశ్య శ్రవణ మాలికను ప్రదర్శించారు.

# అన్నామలై వర్సిటీ వ్యవహారంపై గవర్నర్ అభ్యంతరం

## వీసీ సెర్చి కమిటీలో యూజీసీ ప్రతినిధి ఎక్కడ?

## తక్షణం ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని ఆదేశం

చెన్నై, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నామలై విశ్వవిద్యాలయ ఉపకులపతి నియామకం కోసం యూజీసీ సభ్యుడు లేకుండానే సెర్చ్ కమిటీని నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని గవర్నర్ ఆర్ఎన్ ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవన్ విడుదల చేసిన ప్రకటనలో.. చిదంబరం అన్నామలై విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీని గవర్నర్ నియమించారు. ఈ కమిటీలో గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం, వర్సిటీ సిండికేట్, యూజీసీ ప్రతినిధులున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో యూజీసీ ప్రతినిధిని కమిటీలో నియమించారు. ఎంపిక కమిటీకి గవర్నర్ ప్రతినిధిని కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయాలని అక్టోబరు 25వ తేదీ ప్రభుత్వాన్ని గవర్నర్ ఆదేశించారు. కానీ, ఈ నెల 9న ఎంపిక కమిటీకి సంబంధించిన జీవోను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసింది. అందులో, యూజీసీ ఛైర్మన్ ప్రతినిధిని ఉద్దేశపూర్వకంగా తప్పించినట్లు గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఇది 2021 సుప్రీం కోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని, యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటైన ఎంపిక కమిటీ సిఫారసు మేరకు ఉప కులపతి నియామకం చట్ట విరుద్ధమనిసుప్రీంకోర్టు పేర్కొందని రాజ్‌భవన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 'యూజీసీ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉండడంతో, ప్రభుత్వ ప్రకటన చెల్లదని, ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని గవర్నర్ ఆదేశించారు.

# పెరగనున్న ఆటో ఛార్జీలు!

● డిజి మీటర్ల స్థానంలో యాప్

అడయార్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో ఆటో చార్జీలు పెరగనున్నాయి. ఈ దిశగా, ఆటో డ్రైవర్ సంఘాలు, రవాణా శాఖ అధికారులు చర్చలు జరిపారు. నగరంలో తిరుగుతున్న ఓలా, ఊబర్ క్యాబ్, ఆటో సర్వీసుల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకు డిజిటల్ మీటర్ల స్థానంలో కొత్త యాప్ ఆవిష్కరించి, చార్జీ నిర్ణయించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. ప్రస్తుతం చెన్నై నగరంలో తిరిగే ఆటోలకు మొదటి 1.8 కిలో మీటర్‌కు రూ.25, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.12, వెయిటింగ్ చార్జీగా ప్రతి 5 నిమిషాలకు రూ.3.50 పైసలు చొప్పున, రాత్రి సమయంలో రెట్టింపు చార్జీ 2013 నుంచి వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత ఆటో చార్జీలు పెంచలేదని చాలాకాలంగా ఆటోడ్రైవర్లు వాపోతున్నారు. కొందరు ఆటోడ్రైవర్లు మాత్రం ఈ చార్జీలు తమకు కిట్టుబాటు కావడం లేదంటూ తమకు తోచిన విధంగా వసూలు చేస్తున్నారు. అదేసమయంలో ఓలా, ఊబర్, ర్యాపిడో సంస్థలు ఆటో, బైక్, కారు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చాయి. వీటిలో చార్జీలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండటంతో నగర వాసులు ఈ సర్వీసుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆటో యూనియన్ సంఘాల ప్రతినిధులతో రవాణా శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఇందులో ప్రస్తుతం ఉన్న కనిష్ట చార్జీ రూ.25ను రూ.50కు పెంచి, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.25 చొప్పున పెంచాలని ఆటో యూనియన్ సంఘాల నేతలు కోరారు. ఇదే విషయంపై రవాణా శాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్ల స్థానంలో ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించాలని భావిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా నిర్ణయించిన రేట్లను ప్రభుత్వానికి సిఫార్సు చేశామని వివరించారు. వాటిని పరిశీలించిన తర్వాత త్వరలోనే ఆటో చార్జీల పెంపుపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని అధికారులు వివరించారు.

# రాజ్‌భవన్ ముట్టడి యత్నం

300 మంది కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టు


టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై నేతృత్వంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు

ప్యారీస్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ప్రధాన సమస్యలపై మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు అవకాశం కల్పించక పోవడాన్ని ఖండిస్తూ బుధవారం గిండిలోని రాజ్‌భవన్ ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అమెరికా న్యాయస్థానంలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ ఆదానీ అవినీతిపై విచారణ జరపాలని, మణిపూర్ ఘటనపై మోదీ ప్రభుత్వం స్పందించాలని, పార్లమెంటులో ప్రధాన సమస్యలపై ప్రతి పక్ష సభ్యులు మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ సూచనల మేరకు, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వ పెరుందగై అధ్యక్షతన రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. బుధవారం చేపట్టిన నిరసన ర్యాలీలో, అసెంబ్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌కుమార్, సీనియర్ నేతలు కృష్ణస్వామి, పీటర్ అల్ఫోన్స్, ఎమ్మెల్యే రూబీ మనోహరన్ సహా 300 మందికి పైగా పాల్గొన్నారు. అయితే ఈ ర్యాలీకి అనుమతి లేకపోవడంతో అడ్డుకున్న పోలీసులు 300 మందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. ముందుగా పనగళ్‌మాలిగై వద్ద నిర్వహించిన ధర్నాలో సెల్వ పెరుందగై మాట్లాడుతూ.. గౌతమ్ ఆదానీ భారతీయ అధికారులకు ఎన్నివేల కోట్ల రూపాయలు లంచంగా ముట్టజెప్పారు, ఆదానీ వ్యాపారం దేశంలో న్యాయబద్ధంగా జరుగుతుందా? లేదా అన్న అంశాలపై ఉభయ పార్లమెంట్ సభల్లో ఇండియా కూటమి ఎంపీలు మాట్లాడేందుకు అవకాశం కల్పించకపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలలో పర్యటిస్తున్న నరేంద్ర మోదీ.. వందలాది మంది మృతి చెందిన మణిపూర్‌లో ఇప్పటి వరకు పర్యటించలేదని మండిపడ్డారు.

# కంచే చేను మేసిన వైనం ?!

## రూ.20 లక్షల దోపిడీ కేసులో ఎస్ఐ అరెస్టు

● మరో ముగ్గురు ఐటీ అధికారులు కూడా

అడయార్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తిని అడ్డగించి రూ.20 లక్షలు దోపిడీ చేసిన కేసులో ఎస్ఐ సహా ముగ్గురు ఐటీ అధికారులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై నగర పోలీసు విభాగానికే తలవంపులు తెచ్చేలా జరిగిన ఈ కేసు వివరాలను పరిశీలిస్తే.. ట్రిప్లికేన్ ఓమందూరార్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలో మూడు రోజుల క్రితం వాషర్‌మెన్‌పేటకు చెందిన మహమ్మద్ గౌస్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా.. పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న ఒక వ్యక్తితో పాటు మరో ముగ్గురు గౌస్‌ను అడ్డగించి బ్యాగులో ఉన్న రూ.20 లక్షలు తీసుకుని, కారులో ఎక్కించుకుని కొంత దూరం వెళ్ళిన తర్వాత కారు నుంచి దింపేసి వెళ్ళిపోయారు. దీనిపై గౌస్ ట్రిప్లికేన్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసుల విచారణలో దోపిడీ కేసులో ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజా సింగ్, ఆయన అనుచరులు దామోదరన్, ప్రదీప్, బాబు పాత్ర ఉన్నట్టు తేలింది. ఈ నలుగురినీ బుధవారం అరెస్టు చేసి దోపిడీ కేసు వివరాలపై ఆరా తీశారు. తిరుపత్తూరు జిల్లాలో ఒక కాంగ్రెస్ నాయకుడి దగ్గర కలెక్షన్ ఏజెంటుగా పనిచేసే మహమ్మద్ గౌస్ సీటీ స్కాన్ యంత్రం కొనుగోలు చేసేందుకు రూ.20 లక్షలతో వాణియంబాడి నుంచి నగరానికి వచ్చాడు. సోమవారం రాత్రి డబ్బుతో వాషర్‌మెన్‌పేట నుంచి ట్రిప్లికేన్ బైక్‌పై రాగా, ఆ సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజాసింగ్ డబ్బును చూసి, ఐటీ అధికారులైన దామోదరన్, ప్రదీప్, బాబులకు సమాచారం ఇచ్చాడు. వారు కారులో అక్కడకు చేరుకుని.. మహమ్మద్ గౌస్‌ను కారులో ఎక్కించుకుని ఎగ్మోర్ చిల్డ్రన్స్ ఆస్పత్రి సమీపంలో కారు ఆపి గౌస్‌కు కత్తి చూపి బెదిరించి డబ్బుతో కారులో పారిపోయారు. దోపిడీ చేసిన సొమ్ములో ఎస్ఐ రాజాసింగ్‌కు రూ.5 లక్షలు ఇచ్చి, మిగిలిన సొమ్మును ముగ్గురు ఐటీ అధికారులు పంచుకున్నారు.. ఈ క్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా ఈ కేసును పోలీసులు ఛేదించి, నలుగురిని అరెస్టు చేశారు. అలాగే, దోపిడీలో పాలుపంచుకున్న ఐటీ అధికారుల ఇళ్లల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేసి రూ.15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిని ఆయా శాఖల ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## సమాచార దృష్టి

### రేపు ప్రైవేటు జాబ్ మేళా

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాల కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేటు జాబ్ మేళా జరుగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో సుమారు 50కి పైగా ప్రైవేటు సంస్థలు తమకు అవసరమైన పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయి. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసి, 18 నుంచి 45 ఏళ్లలోపున్న వారు విద్యార్హత సహా సర్టిఫికెట్ల నకళ్లు, దరఖాస్తు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని ఆయా జిల్లాల అధికారులు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

### 27న మాజీ సైనికుల గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల గ్రీవెన్స్ ఈ నెల 27 తేదీ జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో.. బీచ్ రైల్వే స్టేషన్ సమీపంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న శిబిరంలో, మాజీ సైనికులు, కుటుంబ పింఛన్‌దారులు పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చు. శిబిరంలో పాల్గొనే వారు తమ గుర్తింపుకార్డుతో హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు.

### మొబైల్ యాప్ ద్వారా రూ.60 కోట్ల రుణాలు

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలకు 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకొనేందుకు ఏడాది ఆగస్టులో యాప్‌ను పరిచయం చేశారు. ఈ యాప్ ద్వారా సహకార బ్యాంకులు, సంఘాలు అందిస్తున్న రుణాల వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే, రుణాల కోసం ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సహకార శాఖ అధికారులు తెలిపారు.

### రేషన్ దుకాణాలకు 11 రోజులు సెలవు

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం 2025వ సంవత్సరం పొంగల్ సహా 24 రోజులు ప్రభుత్వ సెలవు రోజులుగా ప్రకటించింది. ఈ క్రమంలో, నిత్యావసర వస్తువులు అందిస్తున్న రేషన్ దుకాణాలకు 2025లో 11రోజులు మాత్రమే సెలవు రోజులుగా ప్రకటించారు. ఆ ప్రకారం, జనవరి 14,28, ఫిబ్రవరి 11, మార్చి 31, ఏప్రిల్ 14, మే 1, ఆగస్టు 15,27, అక్టోబరు 2,20, డిసెంబరు 25వ తేది మొత్తం 11 రోజులు రేషన్‌దుకాణాలకు సెలవుప్రకటించారు.

### రేపటి వరకు దరఖాస్తు చేయొచ్చు

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 10వ తరగతి, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాలనుకొనే ప్రైవేటు అభ్యర్థుల దరఖాస్తు సమర్పణ ఈ నెల 20వ తేది వరకు పొడిగించారు. ఈ పరీక్ష రాయగోరు ప్రైవేటు అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 17వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఇదివరకే ప్రకటించారు.ఈ క్రమంలో, అభ్యర్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 20వ తేది వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

### రేపటి నుంచి రోప్‌కార్ సేవలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోలింగర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వెళ్లేందుకు శుక్రవారం నుంచి రోప్‌కార్ సేవలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కొండ ఆలయానికి వెళ్లాలంటే 1,305 మెట్లు ఎక్కాల్సి ఉండడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతుంటారు. వారి సౌకర్యార్థం రోప్ కార్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ రోప్‌కార్‌లో ఆలయానికి వెళ్లేందుకు, కిందికి వచ్చేందుకు ఒకరికి రూ.100 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మరమ్మతుల కారణంగా సోమవారం నుంచి గురువారం వరకు రోప్‌కార్ సేవలు నిలిచిపోయాయి. పనులు పూర్తికావడంతో శుక్రవారం నుంచి రోప్ కార్ సేవలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

### కొత్తగా 10 వృత్తి శిక్షణా కేంద్రాలు

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 10 వృత్తి శిక్షణా కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి సీవీ గణేశన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఈ శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. యువతకు ఉపాధి కల్పించేలా వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చేందుకు కొత్తగా వృత్తి శిక్షణా కేంద్రాలు ప్రారంభించనున్నామన్నారు. వెప్పూర్ (కడలూరు జిల్లా), కుజిలియంపారై (దిండుగల్), సేందమంగళం (నామక్కల్), గంధర్వకోట (పుదుకోట), కళిది (రామనాధపురం), నాట్రాంపల్లి (తిరుపత్తూర్), కూత్తానల్లూర్ (తిరువారూరు), సెంగం (తిరువణ్ణామలై), ఏరల్ (తూత్తుకుడి జిల్లా) తదితర ప్రాంతాల్లో కొత్త వృత్తి శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు రూ.111 కోట్ల కేటాయిస్తూ జీవో విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తండయార్‌పేట పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. నేతాజీ నగర్, నెహ్రూ నగర్, కుమరన్ నగర్, శివాజీ నగర్, సుందరంపిళ్లై నగర్, ఈహెచ్ రోడ్డు, అన్నై సత్యా నగర్, పటేల్ నగర్, పరమేశ్వరన్ నగర్, అజీస్ నగర్, నావలర్ క్వార్టర్స్, దుర్గాదేవి నగర్, బేసిన్ రోడ్డు, బర్మా కాలని, రాజీవ్ గాంధీ నగర్, కరుణానిధి నగర్, ఇందిరాగాంధీ నగర్, సీబిఎస్ఎఫ్ క్వార్టర్స్, నెడుంచెళియన్ నగర్, వైద్యనాధన్ వీధి, కార్నేశన్ నగర్, ఎళిల్ నగర్, చంద్రశేఖర్ నగర్, కేహెచ్ రోడ్డు, మూపనార్ నగర్, మనలి రోడ్డు, తిరువళ్లువర్ నగర్, మీనాంబాళ్ నగర్, అన్నానగర్, జేజే నగర్, సున్నాంబు కెనాల్, వీఓసీ నగర్, కరుమారియమ్మన్ నగర్, మాతా ఆలయ వీధి, త్యాగప్పచెట్టి వీధి, జీవన్ నగర్, కామరాజ్ నగర్, స్వతంత్రపురం, చిగురింతపాళయం, మోక్షపురం, భారతి నగర్, భారతి నగర్ క్వార్టర్స్, రిక్షా కాలని, న్యూ శాస్త్రి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.




చెత్తాచెదారంతో మురుగుకాల్వగా మారిన తాగు నీటి కాల్వ - శ్మశానవాటిక వద్ద పడి ఉన్న చెత్తాచెదారం

# దశాబ్దాలుగా చెత్తకుప్పల మధ్యే జీవనం

● ఆ ఊరివారితో పెళ్లంటే అందరికీ భయం

టి.నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఓమలూరు నగర పంచాయతీలోని నెహ్రూనగర్..!ఊరి పేరు మాత్రం అందం. ఎల్లవేళలా ఊరంతా దుర్గంధం. ఊరికి నలుదిక్కులా చెత్తాచెదారంతో డంపింగ్‌యార్డు. చివరకు శ్మశానవాటిక వద్ద కూడా టన్నుల కొద్దీ చెత్తకుప్పలే దర్శనమిస్తాయి. ఇదేదో రెండు మూడేళ్లుగా కొనసాగుతున్న పరిస్థితి కాదు. సుమారు 8 దశబ్దాలుగా వెయ్యి కుటుంబాలు చెత్తకుప్పల మధ్యే జీవనం సాగిస్తున్నాయి. ఈ అత్యంత దారుణమైన అపరిశుభ్ర వాతావరణంలో జీవించటం వల్ల ఊరివారిలో చాలా మంది చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో ఆ ఊరిలోని యువతను పెళ్ళి చేసుకోవడానికి ఎవరూ సాహించడం లేదు. ఇంతటి దయనీయ స్థితిలో ఉన్న ఆ నెహ్రూ నగర్‌లో 300 నివాసాలున్నాయి. సుమారు 1000 మందికిపై నివసిస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన ప్రజలంతా యేళ్లతరబడి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ ఊరి పొరంబోకు స్థలంలోని డంపింగ్‌యార్డులో పరిమితికి మంచి చెత్త కుప్పలు వేయడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఇదే విధంగా శ్మశానవాటికి స్థలంలోనూ చెత్తాచెదరం వేస్తున్నారు. దాంతో వర్షపునీరు, మురుగునీరు కలిసి ఊరి చుట్టూ మురుగు కాల్వలా ప్రవహిస్తోంది. ఎనిమిది దశాబ్దాలుగా ఆ ఊరి చుటూ చెత్తకుప్పల డంపింగ్ యార్డులు కొండలా పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై నెహ్రూనగర్ వాసులు మాట్లాడుతూ 80 యేళ్లుగా ఊరి పెద్దలు, ప్రముఖులు ఊరి చుట్టూ చేరుతున్న చెత్తాచెదారాన్ని తొలగించాలని అధికారులను కలిసి వందలాది వినతి పత్రాలు సమర్పించారని, అయితే ఏ అధికారి తమ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని చెప్పారు. ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అధికారుల్లో ఏ మాత్రం చలనం రాలేదన్నారు. గతంలో ఈ ఊరి ప్రజలు పొరంబోకు స్థలంలో అడవులకు సమీపంలో వ్యవసాయం చేశారని, అప్పట్లో గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి ఊరి ప్రజలు చెత్త వేయటానికి ఓ స్థలాన్ని కేటాయించారని, ఆ తర్వాత గ్రామం నలువైపులా చెత్త వేయడం ఆనవాయితీగా మారిందన్నారు. కొన్నేళ్ల తర్వాత మరో సర్పంచ్ కొండలా పేరుకుపోయిన చెత చుట్టూ ఎత్తయిన



శ్మశానవాటిక వెనుకవైపు పడి ఉన్న వ్యర్థాలు

ప్రహరీ నిర్మించారని, ప్రస్తుతం ఆ ప్రహరీ ఎత్తు దాటిమరీ టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయిందన్నారు. ఊరి యువకులు కొందరు మాట్లాడుతూ ఓమలూరు పరిసరాలలోని మాంసం దుకాణాల నుండి వ్యర్థాలను, కాలం చెల్లిన మందులను కూడా ఈ ప్రాంతంలోనే వేస్తున్నారని చెప్పారు. ఆ మార్గంలో వెళ్లేవారంతా ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఈ చెత్తకుప్పలలో జంతువుల కలేబరాలు కూడా ఎక్కువగా పడేస్తుంటారన్నారు. ఊరి చుట్టూ ఉన్న చెత్త కుప్పలు తొలగించమని ఎంతోమంది కౌన్సిలర్లకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినా చెత్తను తొలగించేందుకు ఎవరూ రాలేదన్నారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే ఈ చెత్తాచెదారం ఈనాటిది కాదని, చుట్టుపక్కల గ్రామాలవారు తీసుకొచ్చి వేసిన చెత్త అంటూ సమాధానంతో సరిపెట్టుకుంటున్నారు. ఊరిలోని కుర్రాళ్లకు పెళ్ళి సంబంధాలు కుదరకపోవడాన్ని బట్టి నెహ్రూ నగర్ దుస్థితి కళ్ళకుకట్టినట్లు అవగతమవుతుంది. ఎనిమిది దశాబ్దాలుగా దుస్థితిలో ఉన్న ఆ గ్రామం చుట్టూ ఉన్న డంపింగ్‌యార్డులను తొలగించేందుకు అధికారులు ఇకనైనా చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సారా విక్రయాలు ఎందుకు అడ్డుకోవడం లేదు ?

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయాలను ఎక్సైజ్ శాఖ ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించిన మద్రాసు హైకోర్టు, ఈ వ్యవహారంలో ప్రభుత్వ వైఫల్యాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించింది. కళ్లకుర్చిలో నకిలీ సారా తాగి 60 మంది మృతిచెందిన వ్యవహారంలో పోలీసులు, 18 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. తమను గూండా చట్టం కింద అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వారు వేసిన పిటిషన్లను బుధవారం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఎస్ఎం సుబ్రమణ్యం, న్యాయమూర్తి ఎం.జ్యోతిరామన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్లకు సంబంధించిన అఫిడవిట్లు దాఖలుచేశామని, తుది విచారణకు విచారణ జనవరికి వాయిదావేయాలని ప్రభుత్వ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది పీఎస్ రామన్ విజ్ఞప్తి చేశారు. అందుకు ధర్మాసనం, అందరిపై ఎలా గూండా చట్టం ప్రయోగిస్తారని ప్రశ్నించింది. కొన్నేళ్లుగా వీరు కల్తీ సారా విక్రయాలు చేస్తున్నారని ప్రభుత్వ న్యాయవాది బదులిచ్చారు. అందుకు ధర్మాసనం, నకిలీ సారా విక్రయాలు ఎక్సైజ్ శాఖ ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నిస్తూ, తదుపరి విచారణ జనవరి 6వ తేదీకి వాయిదావేసింది.

## మహిళలకు చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలి

● మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ కుమారి




వేలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు హక్కులు, రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ కుమారి అభిప్రాయపడ్డారు. వీఐటీ విశ్వవిద్యాలయంలో 'మహిళా వ్యవసాయ కార్మికుల ఆరోగ్య సమస్యలు' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విశిష్ట అతిథిగా హాజరైన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ కుమారి మాట్లాడుతూ... మహిళలు వ్యవసాయంతో పాటు పలు రంగాల్లో పనిచేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం, రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మహిళల నుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, మహిళలు తమకు ఎదురయ్యే సమస్యల గురించి 181 అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలని కుమారి సూచించారు. అనంతరం వీఐటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.సంధ్య మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో మహిళలు ఎక్కువ మంది ఉన్నారని, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా ఉందన్నారు. మహిళా హక్కుల పరిరక్షణకు అందరూ కృషిచేయాలని, అలాగే, ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలని డా.సంధ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# స్టీల్ షాపులో నగదు మాయం

● రాజస్థాన్‌లో నిందితుల అరెస్టు ● రూ. 58.55 లక్షలు స్వాధీనం

ప్యారీస్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారు పేటలో స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రల షాపులో పని చేస్తూ రూ.75 లక్షలు దోచుకున్న రాజస్థాన్‌కు చెందిన ఇద్దరిని చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. షావుకారు పేటకు చెందిన నిఖిల్ ఆ ప్రాంతంలో నడుపుతున్న స్టెయిన్ లెస్ స్టీల్ షాపులో నెల రోజులుగా రాజస్థాన్‌కు చెందిన లక్ష్మణన్(23), రాజేంద్రన్(24) పనిచేస్తున్నారు. వారం రోజుల క్రితం సొంతూరికి వెళ్లి తిరిగి రాలేదు. అంతేకాక ఆ దుకాణంలోని రూ.75 లక్షలు కనిపించకపోవడంతో షాపు యజమాని నిఖిల్ ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ హరిహరన్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ జిల్లా పోలీసుల సహాయంతో



నిందితులు లక్ష్మణన్, రాజేంద్రన్

లక్ష్మణన్, రాజేంద్రన్ లను మంగళవారం అరెస్టు చేశారు. అంతేగాక వారిళ్ల నుంచి రూ.58.55 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విమానంలో అక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చి విచారణ చేపట్టారు.

## '108' అంబులెన్స్ ఎక్కడుందో తెలుసుకొనేలా 'మ్యాప్' లింక్

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్యం అవసరమైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం '108 అంబులెన్స్' సేవలు పరిచయం చేసింది. ప్రస్తుతం రాజధాని నగరం చెన్నైలో 8 నిమిషాలు, ఇతర జిల్లాల్లో 13 నిమిషాల్లో 108 సేవలు పొందే వసతి ఉంది. ఈ సమయాన్ని మరింత తగ్గించేలా అంబులెన్స్ ఉండే ప్రాంతాన్ని తెలుసుకొనేలా ప్రత్యేక లింక్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అంబులెన్స్ కోసం ఫోన్ చేసిన వారి మొబైల్‌కు డ్రైవర్ నెంబరు, మ్యాప్ మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. ఈ మ్యాప్‌లోని లింక్‌ను సదురు వ్యక్తి క్లిక్ చేస్తే అంబులెన్స్ ఉన్న ప్రాంతం, ఎంత దూరంలో ఉంది తదితరాలు తెలుసుకోవచ్చు. అలాగే, అంబులెన్స్ డ్రైవర్ కూడా ఫోన్ చేసిన వ్యక్తి ఉండే ప్రాంతాన్ని మ్యాప్ చూస్తూ సత్వరం వెళ్లే అవకాశముందని 108 అంబులెన్స్ సేవల రాష్ట్ర అధ్యక్షుడు సెల్వకుమార్ తెలిపారు.

### 22న డీఎంకే కార్యవర్గ సమావేశం

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఈ నెల 22న పార్టీ కార్యవర్గ సమావేశం జరుగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో.. గతంలో నిర్వహించాల్సి సమావేశం భారీవర్షాల కారణంగా వాయిదాపడిందన్నారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగనున్న సమావేశంలో కార్యవర్గ సభ్యులు తప్పకుండా పాల్గొనాలని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విజ్ఞప్తి చేశారు.

### నేడు రవాణా కార్మికుల ఆందోళన

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికుల 15వ వేతన చర్చలు ప్రారంభించాలి సహా పలు డిమాండ్ల సాధనకు రవాణా శాఖ కార్మికులు గురువారం ఆందోళన చేపట్టనున్నారు. ఈ మేరకు ఏఐటీయూసీ విడుదల చేసిన ప్రకటనలో... రవాణా శాఖలోని 8 ప్రాంతీయ కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ఆందోళనలో కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది.

### రాజీవ్ గాంధీ ఆస్పత్రిలో డిజిటల్ చెల్లింపులు

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యూ ఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించే సదుపాయం కల్పించారు. ఈ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరేందుకు, ఎక్స్‌రే తదితర సేవలను నగదు వసూలుచేస్తుంటారు. ఈ నగదును డిజిటల్ విధానంలో చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఆస్పత్రిలోని నాలుగుప్రాంతాల్లో క్యూఆర్‌స్కాన్ ఏర్పాటుచేసినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. కాగా, కొద్దిరోజుల క్రితం రోగులు అందించిన నగదు జమచేయకుండా మోసానికి పాల్పడిన ఇద్దరు సస్పెండ్‌కు గురికావడం తెలిసిందే.

### ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఆరోగ్యశాఖా



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం తదితరులు

మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. సైదాపేటలో టిడ్కో ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి టి.ఎం.అన్బరసుతో కలిసి పరిశీలించిన సందర్భంగా మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడారు. 2021 సంవత్సరం ఆగస్టులో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించిన మక్కలైతేడిమరుత్తువం (ప్రజల వద్దకే వైద్యం) అనే పథకంలో రెండవ విడతలో లబ్దిదారులకు మందుల కిట్ పంపిణీ కార్యక్రమం ఈరోడ్‌లో జరగనుందని తెలిపారు.

### 21న అన్నాడీఎంకే ఆందోళన

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాన్‌తో తీవ్రంగా దెబ్బతిన్న విల్లుపురం జిల్లా ప్రజలను ఆదుకోవడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 21వ తేది అన్నాడీఎంకే ఆందోళన చేపట్టనున్నట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేది 10 గంటలకు విల్లుపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట రాజ్యసభ ఎంపీ సీవీ షణ్ముగం నేతృత్వంలో భారీ ఆందోళన చేపట్టనున్నట్లు ఈపీఎస్ ప్రకటనలో తెలిపారు.

## శబరిమల యాత్రలో విషాదం... వ్యాన్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరు అయ్యప్ప భక్తుల దుర్మరణం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై ఇద్దరు అయ్యప్ప భక్తులు మృతి చెందడం విషాదానికి దారి తీసింది. తేని జిల్లా పెరియకుళం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అయ్యప్ప భక్తులు మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తెలంగాణా రాష్ట్రానికి చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు కారులో శబరిమల వెళ్లారు. స్వామి దర్శనం ముగించుకొని వారు తిరుగుప్రయాణమయ్యాయి. తేనిజిల్లా పెరియకుళం సమీపం కాట్రోడు జంక్షన్‌లో బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు అయ్యప్ప భక్తుల కారు, వత్తలగుండు మార్గంలో వస్తున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు సీట్లో కూర్చున్న ఇద్దరు ఘటనా స్థలంలోనే



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మృతిచెందగా, డ్రైవర్ సహా ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న దేవదానంపట్టి పోలీసులు, క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల సెల్‌ఫోన్ ద్వారా వారి వివరాల కోసం విచారణ చేపట్టారు.

## హార్బర్‌లో రివర్స్ తీసుకుంటూ సముద్రంలో పడిన కారు

● డ్రైవర్ కోసం గాలింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై హార్బర్‌లో రివర్స్ తీసుకుంటున్న కారు సముద్రంలో పడిన ఘటన కలకలం రేపింది. చెన్నై హార్బర్ సమీపంలో కోస్ట్ గార్డ్ సిబ్బందిని తీసుకొచ్చేందుకు మంగళవారం రాత్రి కారు వెళ్లింది. మహమ్మద్ సఫీ అనే కారు డ్రైవర్ సిబ్బందిని ఎక్కించుకొని రివర్స్ తీసుకొనే సయమంలో కారు సముద్రంలో పడిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో తప్పించుకున్నారు. కానీ డ్రైవర్ మహమ్మద్ సఫీ సముద్రంలో పడిపోయాడు. గాయపడిన సిబ్బందిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి, డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

### జైలు శిక్షను వ్యతిరేకిస్తూ హెచ్.రాజా అప్పీలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెరియార్ విగ్రహం ధ్వంసం చేస్తానని ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం, ఎంపీ కనిమొళిని కించపరిచేలా 2018 ఏప్రిల్‌లో వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజాపై డీఎంకే, కాంగ్రెస్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదుపై ఈరోడ్ నగరం, కరుంగల్‌పాళయం తదితర పోలీస్ స్టేషన్లలో రాజాపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు రద్దు చేయాలని కోరుతూ దాఖలుచేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన మద్రాసు హైకోర్టు, మూడు నెలల్లో ఈ కేసులు విచారణ పూర్తిచేయాలని ఎంపీ, ఎమ్మెల్యేపై నమోదైన కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసుల విచారణ ముగించిన కోర్టు, హెచ్.రాజాకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై అప్పీలు చేసుకొనేందుకు రాజాకు 30 రోజుల గడువు విధించింది. ఈ నేపథ్యంలో, ఈ తీర్పును వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో హెచ్.రాజా దాఖలుచేసి అప్పీలు పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

### ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.11 లక్షల మోసం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు పొందవచ్చంటూ రూ.11 లక్షలు దోచుకున్న వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మందవెల్లి ప్రాంతానికి చెందిన సురేష్ సెల్‌ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని, ఆసక్తి ఉంటే ఈ లింక్ క్లిక్ చేయాలని మెసేజ్‌లో ఉంది. దానిని నమ్మిన సురేష్, ఆ లింక్ క్లిక్ చేసి, అందులో తెలిపిన ప్రకారం పలు పర్యాయాలుగా మొత్తం రూ.11 లక్షలు జమ చేశాడు. కానీ, అందుకు ఎలాంటి ఆదాయం లేకపోగా, పెట్టిన నగదు కూడా తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన సురేష్, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### వీధి కుక్కను ఢీకొన్న బస్సు

డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీధి శునకంపై బస్సు నడిపిన వ్యవహారంలో డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. మదురై జిల్లా సేక్కానూరణి ప్రభుత్వ రవాణా సంస్థ డిపోలో నమశ్శివాయం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చోళవందాన్‌కు బస్సు నడుపుతున్న సమయంలో రోడ్డుపై ఉన్న వీధి శునకంపై బస్సు చక్రం ఎక్కడంతో దాని కాలు విరిగినట్లు తెలిసింది. కానీ, నమశ్శివాయం బస్సు ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ వ్యవహారంపై ఓ న్యాయవాది డిపో అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్సు కింద పడి గాయపడిన శునకాన్ని చికిత్సకు తీసుకెళ్లలేదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించాడంటూ నమశ్శివాయంను అధికారులు సస్పెండ్ చేశారు.

### డ్యాం నుంచి బయటకు వచ్చిన మొసలి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా సాత్తూరు డ్యాం పూర్తిస్థాయికి చేరుకుంది. డ్యాంలో ఉండే ఓ మొసలి బుధవారం నీటి నుంచి బయటకు వచ్చింది. ఈ క్రమంలో, పూర్తిస్థాయిలో



మొసలిని మళ్లీ డ్యాంలోకి తరుముతున్న సిబ్బంది

నిండిన డ్యాంను చూసేందుకు ప్రజలు అక్కడకు వచ్చారు. మొసలిని గమనించిన డ్యాం సిబ్బంది వెంటనే ప్రజలను అక్కడి నుంచి పంపించి, మొసలిని తరుముతూ తిరిగి అది డ్యాంలోకి వెళ్లేలా చేశారు.

### విద్యుదాఘాతంతో ఈబీ కార్మికుల మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లాలో విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యుత్ బోర్డు కార్మికులు మృతిచెందారు. మనప్పారై సమీపం కల్లుపట్టి ప్రాంతానికి చెందిన కలామణి (45), అరుణాపట్టికి చెందిన మాణిక్యం (32)లు తిరుచ్చి కేకే నగ



కలామణి మృతదేహం

ర్‌లోని విద్యుత్ బోర్డు కార్యాలయంలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్నారు. తిరుచ్చి వలైయూర్ రింగ్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్‌కు బుధవారం కొత్తగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. దీనికోసం కలామణి, మాణిక్యం సహా పలువురు కార్మికులు వెళ్లారు. కలామణి, మాణిక్యం విద్యుత్ కనెక్షన్ కోసం మెయిన్ లైన్‌లో వైర్లు కలుపుతున్న సమయంలో ఇద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వారిలో కలామణి విద్యుత్ స్తంభంపైనే మృతిచెందగా, మాణిక్యం కిందపడి తీవ్రంగాయా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు అతడిని తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స ఫలించక మృతిచెందాడు. కేకే నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### దోపిడీ దొంగల కాల్పులు

● అమెరికాలో నెల్లైవాసి మృతి

అడయార్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోకి కింగ్‌స్టన్ నగరంలో దోపిడీ దొంగల కాల్పుల్లో నెల్లై వాసి ఒకరు మరణించారు. తెన్‌కాశి జిల్లాకు చెందిన అమృతరాజ్ కింగ్‌స్టన్‌లో సూపర్‌మార్కెట్ స్టోర్ నడుపుతుండా, ఇందులో నెల్లైకు చెందిన విఘ్నేష్ (31) సూపర్‌వైజర్‌గాను, పాండి, సుడలై అనే ఇద్దరు వర్కర్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో భారత కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున 3.30 గంటల సమయంలో కొందరు దోపిడీ దొంగలు సూపర్‌మార్కెట్‌కు దోపిడీకి వచ్చి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో విఘ్నేష్, సుడలై, పాండి గాయపడగా, వీరిలో విఘ్నేష్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు నెల్లైలోని కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం ఇచ్చినట్టు సమాచారం.

## 10 సవర్ల నగల దోపిడి

● నలుగురి అరెస్ట్

తిరుత్తణి, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో తాళం వేసిన ఇంట్లో 10 సవర్ల నగలు దోపిడీ చేసిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

చిత్తూరుకు చెందిన శివాజీ, రాధ దంపతులు పల్లిపట్టులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న వీరు ఇంటికి తాళం వేసి పొరుగూరు వెళ్లారు. మరుసటి రోజు ఉదయం తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి పోలీసులు, ఆంజనేయనగర్‌కి చెందిన శేఖర్, పెరుమాళ్, కొళత్తూర్ గ్రామానికి చెందిన జోసెఫ్, తిరుపతి జిల్లాకు చెందిన భాగ్యరాజ్ ఈ చోరీకి పాల్పడినట్లు తెలుసుకొని మంగళవారం అరెస్టు చేసి, వారి నుంచి 7 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు.

### 24న ఎంజీఆర్‌కు ఈపీఎస్ నివాళి

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ 37వ వర్ధంతి సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఆ పార్టీ నేతలు నివాళులర్పించనున్నారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో.. మెరీనా బీచ్ సమీపంలోని ఎంజీఆర్ స్మారక స్థూపం వద్ద ఈ నెల 24వ తేది ఉదయం 10 గంటలకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పూలు చల్లి నివాళులర్పించనున్నారని, ఈ సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందన్నారు.

చిత్రజ్యోతి

# 'యూఐ' ఫ్రూట్ సలాడ్ వంటింది

**● హీరో ఉపేంద్ర**



మీడియా సమావేశంలో 'యూఐ' చిత్ర బృందం

తాను హీరోగా నటించిన 'యూఐ' చిత్రం ఫ్రూట్ సలాడ్ లాంటిందని, ఇందులో అభిమానులు ఆశించే అన్ని అంశాలు పుష్కలంగా ఉన్నాయని ఆ చిత్ర హీరో ఉపేంద్ర అన్నారు. లహరి ఫిలిమ్స్, వీనస్ ఎంటర్‌టైనర్స్ సంయుక్తంగా జి.మనోహరన్, శ్రీకాంత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20వ తేదీ విడుదలకానుంది. ఉపేంద్ర, రేష్మ హీరోహీరోయిన్లు. రవి శంకర్, సాధు కోకిల తదతరులు ఇతర పాత్రలు పోషించారు. తమిళం, కన్నడ, తెలుగు, మలయాళ, హిందీ భాషల్లో తెరకెక్కించారు. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం మంగళవారం నగరంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసింది. ఇందులో హీరో ఉపేంద్ర మాట్లాడుతూ, 'ఇది ఒక సైకలాజికల్ థ్రిల్లర్. ట్రైలర్‌లోనే అనేక భిన్నమైన అంశాలు చూశారు. అన్ని రకాలైన కమర్షియల్ హంగులున్నాయి. ఈ సినిమాకు నాతో కలిసి పని చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు. నటి రేష్మ మాట్లాడుతూ, 'సినిమా ప్రమోషన్ కోసం తొలిసారి చెన్నై రావడం ఆనందంగా ఉంది. నా పాత్ర గురించి, ఈ సినిమా గురించి ఎక్కువగా మాట్లాడలేను. ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా సర్‌ప్రైజ్ ఇస్తుంది' అని పేర్కొన్నారు. మాటల రచయిత మదన్ కార్కి మాట్లాడుతూ తాను ఏది తీసుకున్నా ప్రత్యేకంగా రూపొందించడానికి ఉపేంద్ర వెనుకాడరు. ఈ చిత్ర కథాంశం అంత విలక్షణంగా ఉంటుంది' అన్నారు. నిర్మాత సమీర్ మాట్లాడుతూ, 'ఈ సినిమా మా అందరికి ఓ పెద్ద కల. ఈ కథను ఏ ఒక్క జోనర్‌కు పరిమితం చేయకూడదు. టెక్నీషియన్స్ ఎంతో శ్రమించారు' అని పేర్కొన్నారు.

# మూగ జీవులకూ ఓ భాష ఉంటుంది

**● మేనకా గాంధీ**



మేనకా గాంధీ - ఎస్ఏ చంద్రశేఖర్

మనలాగే మూగ జీవులకు కూడా ఓ భాష ఉంటుందని, వాటిలో కూడా ప్రేమానురాగాలు ఉంటాయని పీపుల్ ఫర్ అనిమల్స్ ఛైర్‌పర్సన్, కేంద్ర మాజీ మంత్రి మేనక సంజయ్ గాంధీ అన్నారు. సీనియర్ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'కూరన్'. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ బుధవారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఈ చిత్ర ఆడియోను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మేనకా మాట్లాడుతూ, 'మూగజీవులు, మనుషులు అంతా ఒక్కటే. మనలాగే, వాటికి కూడా ప్రత్యేక బాష ఉంటుంది. ప్రేమానురాగాలు ఉంటాయి. మూగజీవులను ప్రేమించే మనుషులకు మాత్రమే దీన్ని గ్రహిస్తారు. ముంబైలో జరిగిన ఒక యధార్థ సంఘటనతో ఈ చిత్రాన్ని నిర్మించారు. మూగ జీవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే మంచి కథాంశంతో రూపొందించిన ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం వినోద పన్నును మినహాయించాలని కోరుతున్నాను. దేశ వ్యాప్తంగా ఉన్న జంతు ప్రేమికులు, న్యాయవాదులు ఈ చిత్రాన్ని చూడాలి' అని మేనకా గాంధీ పిలుపునిచ్చారు. నిధిన్ వేముపాటి దర్శకత్వం వహించగా, ఎస్ఏ చంద్రశేఖర్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రాన్ని వీబీ కంబైన్స్ సమర్పణలో కనా ప్రొడక్షన్స్ పతాకంపై విక్కీ నిర్మించారు.

# 'లవర్ బాయ్'గా అజిత్ కుమార్!



మగిళ్ తిరుమేని దర్శకత్వంలో అజిత్ కుమార్ హీరోగా 'విడాముయర్చి' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతుంది. ఈ సినిమా కోసం హీరో అజిత్ మరింత స్లిమ్‌గా, లవర్‌బాయ్‌గా మారారు. ఈ ఫొటోలను చిత్ర బృందం తాజాగా రిలీజ్ చేసింది. అజిత్ - త్రిష జంటగా నటిస్తున్న ఈ చిత్రం తుదిదశ చిత్రీకరణ ఈ నెల 17 నుంచి ప్రారంభమై ఆరు రోజుల పాటు జరుగనుంది. దీంతో ఈ సినిమా మొత్తం షూటింగ్ పూర్తవుతుంది. ఇప్పటి వరకు టీజర్ మాత్రమే మేకర్స్ విడుదల చేయగా, త్వరలోనే ట్రైలర్, ఆడియో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని జనవరి 10వ తేదీ విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం. హాలీవుడ్‌లో వచ్చిన 'బ్రేక్‌డౌన్' అనే మూవీకి రీమేక్. సింహభాగం షూటింగ్ అజర్‌బైజాన్‌లో పూర్తి చేశారు.

'విడాముయర్చి'లో అజిత్, త్రిష ⟷

'అంబి' ఫస్ట్‌లుక్ రిలీజ్ చేసిన కమల్




# హీరోగా రోబో శంకర్

ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్ హీరోగా అవతారమెత్తారు. 'అంబి' అనే చిత్రంలో హీరోగా నటించారు. హీరోయిన్‌గా అశ్విని చంద్రశేఖర్, ఇతర పాత్రల్లో రమేష్ కన్నా, గంజా కరుప్పు, ఇమాన్ అన్నాచ్చి, మోహన్ వైద్య తదితరులు నటించారు. డీ2 మీడియా పతాకంపై ఎఫ్.ప్రసాద్ ఫ్రాన్సిస్ నిర్మాణంలో బాసర్ జే ఎల్విన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి మాట్లాడుతూ, 'ఇది ఫ్యామిలీ డ్రామా, కామెడీ చిత్రం. కథానాయకుడు నిజజీవితంలో అంబిగా, అమాయకుడిగా ఉంటారు. కొన్ని పరిస్థితుల కారణంగా ఇరుగుపొరుగువారు పెద్ద వీరుడుగా భావిస్తారు. వారి మధ్య చిక్కుకున్న హీరో అంబిగా ఉన్నారా? లేక అన్నియన్ అయ్యారా? అన్నదే ఈ చిత్ర కథ అని పేర్కొన్నారు.

# 'పర్వతమలై' అధిరోహించేందుకు రూ.10 చార్జీ వసూలు

**● రద్దు చేయాలంటున్న భక్తులు**



పర్వతమలై మల్లికార్జున సమేత భ్రమరాంబిక ఆలయం




కొండెక్కేందుకు అటవీ శాఖ ఇస్తున్న టిక్కెట్

టి.నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపం పర్వతమలై పచ్చదనాన్ని కాపాడేందుకని, ఆ కొండపైకి వెళ్లేందుకు అటవీ శాఖ అధికారులు రూ.10 చొప్పున వసూలు చేస్తుండాన్ని భక్తులు తప్పుపడుతున్నారు. తెన్‌మహాదేవ మంగళం అనే గ్రామంలో 4560 అడుగుల ఎత్తు, 5500 ఎకరాల విస్తీర్ణంలో ఉందీ పర్వతమలై. సిద్ధపురుషుల చేత కీర్తించబడి, దక్షిణ కైలాసంగా పిలవబడుతున్న ఈ పర్వతం అత్యంత ప్రాచీనమైనది. ఎన్నో వన మూలికలతో కూడుకుని ఉంది. ఆ పర్వతంపై మల్లికార్జున సమేత భ్రమరాంబిక దేవి ఆలయం ఉంది. మూడో శతాబ్దంలో నన్నన్ అనే రాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. పర్వత శిఖరాగ్రంలో కార్తీక దీపం వెలిగిస్తారు. భక్తులు ఈ పర్వతాన్ని అధిరోహించడానికి ముందుగా పర్వతం దిగువనున్న వీరభద్రస్వామిని దర్శించుకుంటారు. ఇంతటి విశిష్టతలను సంతరించుకున్న పర్వతమలైకి కార్తీకదీపం, ప్రదోషం, పౌర్ణమి, అమావాస్య, సెలవుదినాల్లో భక్తులు ఎక్కువగా వెళ్తుంటారు. నిటారుగా ఉన్న ఈ కొండపైకి వెళ్లడం అంత సులభం కాదు. శివభక్తులంతా భక్తితో పర్వతారోహణ చేస్తుంటారు. చెన్నై, పుదువై నుంచి కూడా పర్వతమలై పరమేశ్వరుడి దర్శనానికి భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో పర్వతమలై పైకి వెళ్లడానికి తిరువణ్ణామలై జిల్లా అటవీ శాఖ రుసుము నిర్ణయించింది. పుదుపాళయం ఫారెస్ట్ రేంజ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్కో భక్తుడి నుండి రూ.10లు వసూలు చేస్తున్నారు. దీని కోసం టికెట్లు కూడా ముద్రించారు. 12 యేళ్లలోపువారికి రుసుము లేదు. పర్వతమలై చుట్టూ ఉన్న తెన్‌మహాదేవ మంగళం, కడలాడి, పట్టియందల్, వీర లూరు, చీనత్తల్, కొంగలమహాదేవి, నల్లాన్ పిళ్లై పెట్రాల్, అరుణగిరి మంగళం, కోయిల్ మాది మంగళం రెవెన్యూ గ్రామాల్లో నివసించే వారికి కూడా రుసుము మినహాయించారు.

ఏది ఏమైనప్పటికి పౌర్ణమి తదితర పర్వదినాల్లో పర్వతమలై సందర్శనకు వచ్చే వేలాదిమంది భక్తుల నుంచి అటవీ శాఖ రూ.10లు రుసుముగా వసూలు చేయడం గర్హనీయమని భక్తజన సంఘాల నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ విషయమై అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ పర్వతమలైకి పౌర్ణమి దినాల్లో 20 వేలకు పైగా భక్తులు, వారాంతపు సెలవు దినాల్లో సుమారు 4 వేల మంది భక్తులు వస్తున్నారని, ఈ కొండెక్కడానికి వచ్చే ఈ భక్తులకు ఈ ప్రాచీన పర్వతాన్ని కాపాడుకోవాలనే ధ్యాస ఉండదన్నారు. కొండపై ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువలను పడేసి వెళ్తుంటారని, వాటిని వెంటనే తొలగించకపోతే పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. ఈ విషయంలో దేవాదాయ శాఖ ఎలాంటి సాయం చేయడానికి ముందుకు రాలేదని, దీంతో తామే పర్వతం పరిసరాలను, పచ్చదనాన్ని కాపాడేందుకు రూ.10ల టికెట్ రుసుము వసూలు చేస్తున్నామని వివరించారు. ఈ ఏడాది కార్తీక మహాదీపం రోజు నుండి ఈ రుసుము వసూలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ రుసుము వసూళ్ల గురించి భక్తులు మాట్లాడుతూ చదురగిరి కొండపైకి వెళ్లేందుకు వసూలు చేస్తున్నట్లే పర్వతమలై ఎక్కడానికి కూడా అటవీ శాఖ అధికారులు రుసుము వసూలు చేస్తున్నారని చెప్పారు. చెత సేకరించడానికి చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని, కొండపైకి ప్లాస్టిక్ వస్తువులను అనుమతించకుండా కఠిన నిబంధనలు విధిస్తే సమంజసంగా ఉంటుందన్నారు. ఎరుమేలి, కాలక్కట్టి, అముదమలై, కరిమలై అనే మార్గాల ఉండా శబరిమలైకి వెళ్లే భక్తులు ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్ళకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారని, ఆ రీతిలోనే పర్వతమలైకి వచ్చే భక్తుల దగ్గరున్న ప్లాస్టిక్ వస్తువలను కొండదిగువనే స్వాధీనం చేసుకుంటే సరిపోతుందన్నారు. ప్లాస్టిక్ నిరోధక చర్యలు చేపట్టి రుసుము వసూలు చేసే పద్ధతికి స్వస్తిపలకాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# నాలుగో రైల్వే టెర్మినల్‌గా పెరంబూర్

**● రూ.428 కోట్లతో సమగ్ర ప్రణాళిక**



పెరంబూర్ రైల్వేస్టేషన్

అడయార్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి రాజధాని నగరం చెన్నై వస్తున్న రైళ్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో, మరిన్ని రైళ్లు నడిపేలా పెరంబూర్ రైల్వేస్టేషన్ నాలుగో టెర్మినల్‌గా రూపుదిద్దుకోనుంది. ఇందుకు సంబంధించి జూన్‌లో దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ప్రకటించారు. నిర్వహణరీత్యా అనుమతి పొంది, రూ.428 కోట్లతో సమగ్ర ప్రణాళిక నివేదిక తయారైంది. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... చెన్నై సెంట్రల్-అరక్కోణం మార్గంలో పెరంబూర్ రైల్వేస్టేషన్ ప్రధానంగా ఉందన్నారు. ప్రతిరోజు 80 ఎక్స్‌ప్రెస్‌లు, 150 సబర్బన్ రైళ్లు ఈ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో అందుకనుగుణంగా స్టేషన్‌లో మౌలిక వసతుల కల్పన చేపట్టామన్నారు. పెరంబూర్ సమీపంలో తగిన స్థలం అందుబాటులో ఉండడంతో, నాలుగో రైల్వే టెర్మినల్‌గా మార్చేలా సమగ్ర ప్రణాళిక సిద్ధమైందని తెలిపారు. ప్రయాణికులకు అదనపు వసతులు, పార్శిల్ కార్యాలయం, వాహనాల పార్కింగ్, వాణిజ్య కాంప్లెక్స్, ప్రహరీ తదితరాలతో పాటు ప్రవేశద్వారం రూపొందించే అంశాలు నివేదికలో ఉన్నాయన్నారు. ఈ నివేదిక రైల్వే శాఖకు పంపుతున్నామని, అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. పెరంబూర్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం నాలుగు ప్లాట్‌ఫారాలుండగా, అదనంగా మరో రెండు ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నామన్నారు. ఈ స్టేషన్ నుంచి రైళ్లు నడిపేలా పెరంబూతర్-అంబత్తూర్ మధ్య అదనంగా 5,6 కొత్త రైలు మార్గాలు ఏర్పాటుచేయనున్నామని, ఈ కొత్త రైల్వే టెర్మినల్ 2028లో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

## పొంగల్ ప్యాకేజీ విక్రయాలు ప్రారంభం



విక్రయాలు ప్రారంభిస్తున్న మంత్రి పెరియకరుప్పన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొంగల్ ప్రత్యేక ప్యాకేజీ విక్రయాలను మంత్రి పెరియకరుప్పన్ ప్రారంభించారు. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో పొంగల్ సందర్భంగా వివిధ రకాల సరుకులతో కూడిన మూడు రకాల ప్యాకేజీల విక్రయాలు చేపట్టనున్నట్లు మంత్రి పెరియకరుప్పన్ ప్రకటించారు. ఆ ప్రకారం తేనాంపేటలోని కామధేను సహకార దుకాణంలో ఈ ప్యాకేజీ విక్రయాలను బుధవారం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. పచ్చి బియ్యం, బెల్లం, ఏలకులు, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, నెయ్యి, పెసరపప్పు తదితరాలతో కూడిన ప్యాకేజీ రూ.199కు విక్రయిస్తున్నారు. అలాగే, పసుపు, చక్కెర, కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, ధనియాలు, చింతపండు, మిరప పొడి, శెనగలు, వేరుశెనగ నూనె సహా 35 రకాలతో కూడిన ప్యాకెట్ రూ.499కు విక్రయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ ప్రధాన కార్యదర్శి డా.జె.రాధాకృష్ణన్, అధికారులు ఉన్నారు.

# 'కలైంజర్ కనవు ఇల్లం'కు మరో రూ.400 కోట్లు

**● సీఎం స్టాలిన్ ఆదేశం**

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'కలైంజర్ కనవు ఇల్లం' పథకానికి మరో రూ.400 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం అదనంగా కేటాయించిన రూ.400 కోట్లతో కలిపి ఈ పథకానికి రూ.1,451.34 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ విషయమై సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... కలైంజర్ కనవు ఇల్లం పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష మందికి కాంక్రీట్ ఇళ్లు నిర్మించేందుకు ఒక ఇంటికి రూ.3.50 లక్షల చొప్పున మొత్తం రూ.3,500 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 8 లక్షల గుడిసెలున్నట్లు, 'అందరికి ఇల్లు' అనే లక్ష్యంతో 8 లక్షల కాంక్రీట్ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో లక్ష ఇళ్ల నిర్మించేందుకు అనుమతులు జారీ చేసింది. ఈ పథకంలో లబ్ధిదారుల ఆర్థిక భారం తగ్గించేలా 'టాన్‌సెమ్' సిమెంట్, ఇనుప కమ్ములు తక్కువ ధరకు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. ఇంటి నిర్మాణంలో నేలమట్టం, కిటికీ, రూఫింగ్ పూర్తయిన తర్వాత మొత్తం నాలుగు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. ఈ పథకానికి రూ.1,051.34 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, రూ.860.31 కోట్లు విడుదల చేసింది. అలాగే, సిమెంట్, ఇనుప కమ్ములను రూ.135.30 కోట్లకు ఆయా శాఖల ద్వారా కొనుగోలు చేసింది. ఈ ప్రకారం, ఇప్పటివరకు కలైంజర్ కనవు ఇల్లం పథకానికి రూ.995.61 కోట్లు విడుదల చేశారు. ఈ పథకానికి ప్రస్తుతం అదనంగా రూ.400 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ పథకానికి మొత్తం రూ.1,451.34 కోట్లు కేటాయించినట్లు, ఇళ్ల నిర్మాణాలు త్వరిగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు సచివాలయం తెలియజేసింది.

## ఊటీ కొండ రైలు సేవలు ప్రారంభం



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మేట్టుపాళయం-ఊటీ మధ్య కొండ రైలు సేవలు ఐదు రోజుల అనంతరం మళ్లీ ప్రారంభమయ్యాయి. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం నుంచి నీలగిరి జిల్లా ఊటీ మధ్య కొండ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. వర్షాకాలంలో అటవీ ప్రాంతాల్లో మట్టిచెరియలు కొండ రైలు మార్గంపై పడుతుండడంతో ఈ రైలు సేవలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో, ఈ నెల 13 నుంచి 17వ తేది వరకు నీలగిరి జిల్లాకు భారీ వర్షసూచన ప్రకటించారు. దీంతో, ముందస్తు చర్యల కింద కొండ రైలు సేవలు ఐదు రోజులు రద్దు చేశారు. ఐదు రోజుల అనంతరం బుధవారం ఉదయం 7.10 గంటలకు మేట్టుపాళయం నుంచి ఊటీకి కొండ రైలు బయల్దేరడంపై పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తిరుచ్చిలో 'కలైంజర్ గ్రంథాలయం'

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో కలైంజర్ గ్రంథాలయం ఏర్పాటుకు రూ.290 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. జూన్ 27న జరిగిన శాసనసభ సమావేశాల్లో, తిరుచ్చిలో ప్రపంచస్థాయి గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, తిరుచ్చి టీవీఎస్ టోల్‌గేట్ సమీపంలో 4.57 ఎకరాల స్థలం ఎంపిక చేశారు. మొత్తం 7 అంతస్తులతో ఈ గ్రంథాలయం ఏర్పాటుచేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో, గ్రంథాలయం, మేథో కేంద్రం ఏర్పాటుకు రూ.290 కోట్ల కేటాయిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ అనుమతులు మంజూరు చేసారని, ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు. ఈ గ్రంథాలయం ఏర్పాటుపై జిల్లా ప్రజలు, డెల్టా జిల్లాల యువకులు, రచయితలు, పాఠకులకు ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యావాదాలు తెలిపారని మంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో 'విభూది, రుద్రాక్ష'



అద్దాల పెట్టెలో ఉంచిన విభూది, రుద్రాక్ష

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగేయం సమీపం శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయ ఉత్తర్వుల పెట్టెలో మంగళవారం విభూది, రుద్రాక్ష ఉంచి పూజలు చేస్తున్నారు. తిరుప్పూర్ జిల్లా కాంగేయం సమీపంలోని శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలో మరే ఆలయంలో లేని విధంగా ఈ ఆలయంలో 'ఆండవన్ ఉత్తర్వుల పెట్టె' ఉంది. ఈ పెట్టెలో ఉంచే వస్తువు ప్రపంచంలో జరిగే పరిమాణాలను సూచిస్తుందని భక్తుల నమ్మకం.అదే సమయంలో, ఆ పెట్టెలో ఏ వస్తువు ఉంచాలో మురుగన్ ఎవరైనా భక్తుల కలలో కనిపించి చెబుతుంటారని నమ్మకం.ఆ ప్రకారం, ఈ నెల 10 తేది నుంచి కాశి తీర్థం ఉంచి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో, ఉసిలంబట్టికి చెందిన ఓ భక్తుడి కలలో పెరుమాళ్ దర్శనమిచ్చి, పెట్టెలో విభూది, రుద్రాక్ష ఉంచాలని సూచించినట్లు తెలిసింది. ఆ భక్తుడు ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు తెలుపడంతో, ఆలయంలోని ఉత్తర్వుల పెట్టె (అద్దాల పెట్టె)లో మంగళవారం నుంచి విభూది, రుద్రాక్షలు ఉంచి పూజలు చేస్తున్నారు.

## శ్రీవైకుంతం స్టేషన్ మాస్టర్‌కు కేంద్రప్రభుత్వ అవార్డు



స్టేషన్ మాస్టర్ జాఫర్ అలీ

టి.నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంతం రైల్వే స్టేషన్ మాస్టర్ జాఫర్ అలీ కేంద్ర రైల్వే శాఖ విశిష్ట సేవా అవార్డుకు ఎంపికయ్యారు. భారతీయ రైల్వే శాఖ విశిష్ట సేవలందించే రైల్వే సిబ్బందిని అంగీకరించేలా ప్రతియేటా జాతీయ స్థాయిలో 'అతి విశిష్ఠ రైల్ సేవా పురస్కార్' పేరుతో కేంద్ర ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేస్తుంది. ఆ మేరకు దేశవ్యాప్తంగా ఈ అవార్డు కోసం వంద మంది రైల్వే సిబ్బంది, అధికారులను ఎంపిక చేశారు. దక్షిణ రైల్వేలో ఆరుగురు సిబ్బంది, ఇద్దరు రైల్వే అధికారులు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. మదురై జోన్‌లో సీనియర్ జోనల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మంజునాథ యాదవ్, శ్రీవైకుంతం స్టేషన్ మాస్టర్ జాఫర్ అలీ తదితరులు ఎంపికయ్యారు. ఢిల్లీలో ఈ నెల 21న జరిగే కార్యక్రమంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ అవార్డులను అందజేయనున్నారు. గత యేడాది డిసెంబర్ 17 రాత్రి 899 మంది ప్రయాణికులతో సెంధూర్ ఎక్స్‌ప్రెస్ వెళుతున్నప్పుడు భారీ వర్షాల కారణంగా రైలు పట్టాలు నీటిలో మునిగాయి. ఈ విషయాన్ని గమనించిన స్టేషన్ మాస్టర్ జాఫర్‌అలీ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఉన్నతాధికారుల అనుమతితో ఆ రైలును నిలిపివేశారు. ఆ సమయంలో ఆ రైలులో ప్రయాణిస్తున్నవారంతా జాఫర్ అలీతో గొడవపెట్టుకున్నారు. మరుసటి రోజు ఉదయం ఆ రైలు మార్గంచుట్టూవరద నీటిని చూసి ప్రయాణికులు దిగ్భ్రాంతి చెందారు. స్టేషన్ ముందుజాగ్రత్తగా రైలు నిలిపి తమ ప్రాణాలను కాపాడినట్లు తెలుసుకున్నారు. ఆ తర్వాత స్టేషన్ మాస్టర్ జాఫర్ అలీకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సంఘటనను గుర్తించి రైల్వే శాఖ ఆయనను 'అతి విశిష్ఠ రైల్ సేవా పురస్కార్'తో సత్కరించనుంది.

## ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్‌లో పుదుచ్చేరికి చెందిన 50 యేళ్ల మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. గుండెచుట్టూ రెండు పొరలు కలిగిన పెరికార్డియంలోని కణితిని తొలగించి ఆస్పత్రి వైద్యనిపుణులు సరికొత్త రికార్డు సృష్టించారు. గుండెను ఆనుకుని ఉండే పెరికార్డియంను పూర్తిగా ఆక్రమించుకుని 5 సెంమీల వ్యాసంతో ఉన్న గుండ్రటి కణితిని ఆస్పత్రి వైద్యనిపుణులు కీహోల్ సర్జరీ ద్వారా తొలగించి ఆ మహిళకు ఉపశమనం కలిగించినట్లు ఎస్ఆర్ఎం గ్రూప్ అధ్యక్షుడు డాక్టర్ పి. సత్యనారాయణన్ తెలిపారు. విపరీతమైన దగ్గు, శ్వాసకోశ సమస్యతో చికిత్స కోసం చేరిన ఆ మహిళకు ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్ సీనియర్ కార్డియాక్‌థొరాసిక్ కన్సల్టెంట్ డాక్టర్ సుజిత్ వేలాయుధన్ ఇందిరా నాయకత్వంలో డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ బి.నంబియన్ రాజరాజన్, డాక్టర్ సింధూతో కూడిన వైద్య బృందం ఈ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు రూ.1000

**● 30న ప్రారంభించనున్న సీఎం**

పెరంబూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సహాయం పొందుతున్న ఎయిడెడ్ పాఠశాల విద్యార్థినులకు నెలకు రూ.1,000 అందజేసే పథకాన్ని ఈ నెల 30వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ పాఠశాలల్లో తమిళ మీడియంలో పాఠశాల విద్య పూర్తిచేసి, ఉన్నత విద్యలో చేరిన విద్యార్థినులకు నెలకు రూ.1,000 అందించే 'పుదుమై పెన్' పథకం అమలులో ఉంది. ఈ పథకాన్ని ఎయిడెడ్ పాఠశాలకు కూడా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరంలో ఎయిడెడ్ పాఠశాలల్లో మొదటి, రెండవ, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు నెలకు రూ.1000 అందించే పథకాన్ని ఈ నెల 30వ తేది తూత్తుకుడిలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని మంత్రి గీతాజీవన్ తెలిపారు.

## ■ అద్భుత క్షేత్రం తిరుమల



● విద్యాశంకర భారతీస్వామి

ఈ బ్రహ్మాండంలో అద్భుతమైన క్షేత్రం తిరుమల అని పుష్పగిరి శంకరాచార్య మఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి అన్నారు. బుధవారం నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'రామరాజ్యం వచ్చి ప్రజలందరూ ఆనందంగా ఉండాలి. లోకాన్ని రక్షించాలి. జనాల్లో సద్బుద్ధి, ధార్మిక చింతన కలగాలి' అని స్వామిని కోరుకున్నానని చెప్పారు. స్వామి మహత్యం కనిపిస్తే తద్వారా హైందవ లోకంలో సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. ఆలయం వద్ద భారతీస్వామికి అర్చకబృందం, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ■ పెద్దజీయర్‌స్వామికి పెద్ద మర్యాద




అమ్మవారి ఆలయం వద్ద పెద్దజీయార్‌స్వామి

పెరియ కోయిల్ కెల్వియప్పన్ శఠగోప రామానుజ పెదజీయర్‌స్వామికి బుధవారం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం.. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో పెద్దమర్యాద జరిగింది. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం ఆయన అమ్మవారు, గోవిందరాజస్వామి మూలవర్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవద్ రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో పెద్దజీయర్ మఠం ఏర్పాటైంది. శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలను ఇప్పటికీ పెద్దజీయర్ పర్యవేక్షిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు.. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీఏఓ బాలాజీ, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, శాంతి, నాగరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుచానూరు/తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





### సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**సోమవారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.59 కోట్లు

**మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు:** 63,598

**తలనీలాలు సమర్పించిన వారు:** 20,102



చలిగాలులు...

తుపాను వాతావరణంతో చలిగాలులు విపరీతంగా పెరిగిపోయాయి. సూర్యుడి జాడ పెద్దగా కనిపించడదం లేదు. కనిపించినా ఎండ పడడం లేదు.ఈ వాతావరణం కొత్త అనారోగ్యాలకు దారి తీస్తోంది. జలుబు, దగ్గు, జ్వరాలతో జనం ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఇప్పటికే కురిసిన వానలకు కుంటలన్నీ నిండిపోయి దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. వృద్ధులు, పిల్లలు శ్వాసకోస సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇటువంటి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

# పాటించాలి జాగ్రత్తలు



### పిల్లలు జాగ్రత్త



చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన జలుబు, దగ్గు, జ్వరాలు బారిన శీతాకాలంలో ఎక్కువగా పడుతారు. జలుబు తీవ్రత వల్ల ఊపిరి పీల్చుకునేందుకు కూడా ఇబ్బంది పడతారు. నిద్ర పట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను వీలైనంత వరకు బయట చల్లగాలులకు తీసుకు వెళ్లకూడదు. ఉన్ని, ఒదులుగా ఉండే దుస్తులను పిల్లలకు వేయడంతోపాటు చెవుల్లో గాలిపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఆహారం, నీళ్లు, వెచ్చగా ఉండాలి. కూల్‌డ్రింక్స్‌కి, స్వీట్లుకి దూరం పెట్టాలి. నెలల బిడ్డల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మేలు.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయా



### బాలింతలూ.. ఇవి పాటించండి!



చలికాలంలో బాలింతలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచు, చలిగాలులలోకి రాకూడదు. బయటకు రావలసివస్తే చెవుల్లోకి గాలిపోకుండా చూసుకోవాలి. వానకు తడిస్తే వెంటనే బట్టలు మార్చుకోవాలి. పోషక విలువలున్న ఆహారమే తీసుకోవాలి. అదీ వేడిగా ఉండేలా చూసుకోవాలి. కాన్పు తర్వాత కనీసం అయిదు నెలలపాటు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. వారు ఆరోగ్యంగా ఉంటేనే, వారి చిన్నారులూ ఆరోగ్యంగా ఉంటారు.

-డాక్టర్ పార్థసారథిరెడ్డి, తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్

### వృద్ధుల కోసం రుయాలో ప్రత్యేక ఓపీ కౌంటర్లు



చలికాలం, వానా కాలం .. వృద్ధులే అనేక ఆరోగ్య సమస్యల బారిన పడతారు. రుయాలో వృద్ధుల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలను అందుబాటులో ఉంచాం. ఓపీకి వస్తున్న వారిలో 50 ఏళ్లు పైబడిన వారే ఎక్కువ. జలుబు, దగ్గు, జ్వరాలు వంటి జబ్బులతో, శ్వాసకోస సమస్యలతోనే వీరు వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వృద్ధులకు సాయంగా ఇద్దరు అటెండర్లు ఉంటే మంచిది.

-డాక్టర్ రవిప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్



రుయాస్పత్రిలో వైద్యం కోసం వృద్ధుల క్యూ



### గ్రామీణులూ.. ఆరోగ్యం భద్రం





వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బందితోపాటు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ వారి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాము. అవసరమైన చోట వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

-డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి



## ఆపత్కాలంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు ఎనలేనివి





ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి

● యువజన, క్రీడలశాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆపత్కాల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. తిరుపతి నగరం ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని (2ఏ)ఆర్‌అండ్‌వీ రెజిట్ ఎన్‌సీసీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. లెఫ్టినెంట్ కల్నల్ అనుప్, కల్నల్ సతీందర్ దహియా, వెటర్నరీఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ, అధికారులు, ఎన్‌సీసీ యూనిట్ల ఆర్మీసిబ్బంది, సివిల్‌సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మెజెస్టిక్ ఆర్మీ గుర్రంపై క్యాడెట్లు దూకడం.. ఆర్మీగుర్రాలు గుడ్‌లక్, రోమన్‌ఫామ్, గగన్, రాణిపై జంపింగ్ విన్యాసాలు.. ఒకచేత్తో ఈటెతో దూసుకుపోతూ మరోచేత్తో గుర్రాన్ని అదుపు చేస్తూ చేసిన టెంట్ పెగ్గింగ్ ప్రదర్శన.. ఫైర్‌జంప్ వంటి గుర్రపుస్వారీలను క్యాడెట్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

### పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గూడూరు పట్టణం మాళవ్యానగర్ ప్రాంతానికి చెందిన జనార్దన్ చిల్లర దుకాణం నిర్వహించేవాడు. 2020 సెప్టెంబరులో పదకొండేళ్ల బాలిక సరుకులు కొనేందుకు దుకాణానికి రాగా అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడు జనార్దన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

### శ్రీవారి సేవలో క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్



తిరుమల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): టీంఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం చేయించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల వీరేంద్ర సెహ్వాగ్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.

### 47 రెవెన్యూ సభలు.. 699 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం 47 రెవెన్యూ గ్రామసభలను నిర్వహించగా, 699 అర్జీలు అందాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇళ్ల స్థలాలు 55, అసైన్‌మెంట్ భూమిపై 53, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 36, భూ ఆక్రమణలు 2, ఆర్‌వోఆర్‌పై 370, ఇతర విషయాలకు సంబంధించి 148 చొప్పున 699 అర్జీలు వచ్చాయన్నారు. అప్పటికప్పుడే 15 సమస్యలను పరిష్కరింగా.. మిగిలిన వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు 8,003 ఫిర్యాదులు అందినట్లు వివరించారు.

## హత్యకేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి చెప్పారు. ఈ వివరాలను బుధవారం ఆయన శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరించారు. 'అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ అదృశ్యంపై వన్‌టౌన్ సీఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏర్పేడు మండలం పల్లంగొల్లపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్ ముగ్గురు కలిసి అతడిని హత్య చేసినట్లు విచారణలో గుర్తించారు. మంగళవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. ఈ హత్యకేసులో నిందితులైన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు' అని డీఎస్పీ వివరించారు ఈ కేసును చేధించిన సీఐ గోపి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు హేమాద్రి, శంకర్, బాలచంద్ర, గంగాధర్, ప్రసాద్, రవిచంద్ర, సుందరంను ఆయన అభినందించారు.

## అయ్యో.. తల్లి..!

● ఆస్పత్రికి తీసుకొచ్చి ఓపీ తెస్తానంటూ పరారైన సహాయకుడు

● రుయా ముందు దీనస్థితిలో వృద్ధురాలు



చేతి గాయానికి కట్టు. నడవలేని స్థితి. నోటి మాటా సరిగా రాలేదు. దీనస్థితిలో ఉన్న ఈ 70 ఏళ్ల వృద్ధురాలిని బుధవారం తిరుపతిలోని రుయాస్పత్రిలో వదిలేశారు. ఈమెను ఉదయం ఓ వ్యక్తి ఆటోలో రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చాడు. అక్కడ వైద్య సిబ్బందికి ఆమె కుమారుడినని చెప్పాడు. ఓపీ తెమ్మంటే.. తెస్తానంటూ వెళ్లిన వాడు మళ్లీ రాలేదు. అత్యవసర విభాగంలోని వైద్యులు ఆమెను పరీక్షించగా.. చేతికి తీవ్ర గాయాలున్నట్లు గుర్తించారు. మందు రాసి కట్టుకట్టారు. ఆమె వెంట వచ్చిన వ్యక్తి కోసం సిబ్బంది విచారించారు. ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం వరకు అత్యవసర విభాగంలో ఉంచి అనంతరం బయటకు పంపేశారు. నడవలేని స్థితిలో ఉన్న ఆ తల్లి.. అత్యవసర విభాగం ముందు ఓ చెట్టు కింద నిస్సహాయంగా కూలబడ్డారు. చలికి వణుకుతూ.. చిన్నపాటి చినుకులకు తడుస్తూ తనవారికోసం నిరీక్షిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, స్థానికులు నిన్ను ఎవరు తీసుకొచ్చారని అడిగితే.. నా కొడుకు అనే సమాధానం తప్ప ఇంకేమీ చెప్పలేదు. చెప్పేందుకూ ఇష్టపడలేదు. పదే పదే అడిగితే నన్ను ఇలాగే వదిలేయండి అంటూ చెమ్మగిల్లిన కన్నీళ్లతో ప్రాధేయపడ్డారామె. ఆమె పరిస్థితికి చలించిన సెక్యూరిటీ సిబ్బంది.. చిన్నపాటి దుప్పటి, నీరు, కొంచెం ఆహారం అందించారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

### 16.5 కిలోల గంజాయి స్వాధీనం

● ఐదుగురి అరెస్టు

భాకరాపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో బస్టాండులో నిఘా పెట్టామన్నారు. తలకోన వైపు వెళ్లడానికి అనుమానాస్పదంగా తిరుగుతున్న తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన జాఫర్ బిలాల్, తమిళసెల్వం, రాజాదొరై, కర్ణాటక రాష్ట్రం దావణగెరెకు చెందిన ఇస్మాయిల్, రఫీక్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారి నుంచి రూ.2.3 లక్షల విలువైన 16.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులను రిమాండుకు పంపామన్నారు.

### ఈవీఎం గోదాముల వద్ద పటిష్ఠ భద్రత



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ఠ భద్రత ఉండేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ తెలిపారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలో ఈవీఎంలను భద్రపరచిన సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ రోజున మొరాయించిన 66 ఈవీఎంలను బెల్ కంపెనీకి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవీఎం గోదాముల ఇన్‌చార్జి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దారు సురేష్‌బాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మసోత్సవాలు ఈనెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీపీటీవో జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని డిపో మేనేజర్ల పరిధిలో 5,889 డోర్ డెలివరీలు చేయాల్సి ఉందని వెల్లడించారు.

### 21 నుంచి లా స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ నిర్వహించే వివిధ లా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 21వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. 27వ తేదీ దాకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. లాసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులు. మూడు, ఐదేళ్ల డిగ్రీ కోర్సులతో పాటు రెండేళ్ల పీజీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. వీటి భర్తీకి ఈ అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో లా విభాగంలో సంప్రదించవచ్చునని పీఆర్వో శ్రీరజని తెలిపారు.

## సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'

● రూ.87 లక్షలు విలువ చేసే 435 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మొబైల్ హంట్' సేవలు సత్ఫలితాలిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.87 లక్షల విలువ చేసే 435 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు 11 విడతల్లో 3840 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని వివరించారు. ప్రస్తుతం 12వ విడతలో నెల రోజుల వ్యవధిలో 435 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. సైబర్ క్రైం పోలీసుల పనితీరు వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఎవరైనా తమ మొబైల్ ఫోను పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా వెంటనే మొబైల్ హంట్ నెంబరు 94906 17873 కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. దీనికి వచ్చే లింకులో వివరాలు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అపరిచితులు విక్రయించే సెల్‌ఫోన్లను ఎవరూ కొనొద్దని సూచించారు. ప్రస్తుతం ఈ సెల్‌ఫోన్లను కేరళ, ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి రికవరీ చేశామని తెలిపారు. ఈ రికవరీలో ప్రతిభ చూపిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ల్యాట్ సీఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

**జిల్లా పోలీసు వెబ్‌సైట్ ప్రారంభం**

ప్రజలకు సత్వరమే పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం 'జిల్లా పోలీసు వెబ్‌సైట్'ను ప్రారంభించారు. ఇకపై పారదర్శకత, జవాబుదారీతనం, పౌర స్నేహపూర్వక పోలీసింగ్ విధానం అలవాటు అవుతుందన్నారు. జిల్లా పోలీసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ ఐటీ కోర్ బీకే సుధాకర్ పాల్గొన్నారు.